ఆంధ్రజ్యోతి
1

కుమరం భీం
జిల్లా వార్తలు
గురువారం 2 అక్టోబరు 2025







వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం లోని బ్రాహ్మణవాడ శ్రీ కేశవనాథ స్వామి ఆలయంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు దేవదాయ, ధర్మాదాయ శాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవోపేతంగా కొనసాగాయి. బుధవారం చివరి రోజు స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని గజవాహనంపై పట్టణ వీధుల గుండా భాజాభజంత్రీల మధ్య, భక్తి పాటలతో శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ఒజ్జల నరేష్ శర్మ, మధుకర్ శర్మ, మహేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. శోభాయాత్ర అనంతరం ఆలయంలో మంగళహారతి, మహా మంత్రపుష్పం, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్తా, ఆలయ కమిటీ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, సభ్యులు సుగుణాకర్, ప్రతాప్, సాయి, ప్రవీణ్, వెంకట్‌రవీందర్, అభయ్, శేషగిరి, గోపాల్, శ్రీనివాస్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.



దసరాకు సర్వం సిద్ధం

- నేడు విజయదశమి పర్వదినం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జమ్మిచెట్టుకు పూజలు



ఆసిఫాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): విజయానికి సూచికగా జరుపుకునే పండుగే విజయ దశమి.. విజయదశమి చాలా విశిష్టమైన రోజు. ఈ రోజున చేపట్టిన ప్రతీ పనిలో విజయం లభిస్తోందని నమ్మకం. విజయదశమి అంటే విజయాలను కలుగచేసే దశమి అని అర్థం. చెడు మీద మంచి విజయం సాధించినందుకు గుర్తుగా మనం విజయ దశమి పండుగను ఏటా జరుపుకుంటాం. విజయదశమి రోజున ప్రారంభించే ఏ పని అయినా అఖండ విజయం సాధిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. దీనినే దసరా పండగ అని కూడా అంటారు. మహిషాసురుడు అనే రాక్షసుడు లోకకంఠకుడుగా మారి ముల్లోకాలలో స్వైర విహారం చేశాడు. తట్టుకోలేని దేవతలు మహిషాసురుడిని సంహరించాలని జగన్మాతను కోరారు. దేవతల కోరిక మేరకు జగన్మాత తొమ్మిది రోజులు మహిషాసురుడితో యుద్ధం చేసి పదోరోజున రాక్షసుడిని సంహరించారు. దీంతో రాక్షస పీడ విరగడైనందుకు గుర్తుగా దసరాగా జరుపుకుంటారు. అశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలుకొని నవమి వరకు దేవి నవరాత్రులు జరుపుకుంటాం. ఈ తొమ్మిది రోజులు దుర్గాదేవిని వివిధ రూపాల్లో అలంకరించి అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తారు. ఆశ్వయుజన మాసం నుంచి వర్ష రుతువు వెళ్లి శరద్ రుతువు ప్రవేశిస్తుంది. కనుక ఈ నవరాత్రులను శరన్నవరాత్రులు అని కూడా అంటారు. దేవీ నవరాత్రులలో పదో రోజు విజయ దశమి అని అంటారు.


జిల్లా కేంద్రంలో ముస్తాబైన ఆలయం

జిల్లాలో ఏర్పాట్లు పూర్తి..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో దసరా ఉత్సవాలను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కేంద్రమైన ఆసిఫాబాద్‌లో పెద్దవాగు నదితీరాన ఏర్పాట్లను ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పూర్తి చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలో విజయ దశిమి ఉత్సవాలతో పాటు రావణ దహన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఉత్సవాల ఏర్పాటు పనులను అధికారులు పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలుగ కుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు కాగజ్‌నగర్ పట్టణంలో త్రిశూల్ పహాడ్, శివమల్లన్న ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలు జరుపుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూరు, దహెగాం, రెబ్బెన, వాంకిడి, కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, తిర్యాణి మండలాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.దసరా రోజున పాలపిట్ట దర్శనం, జమ్మి చెట్టు పూజ, బంధుమిత్రుల ఆశీర్వాదాలు ప్రత్యేకంగా కనిపిస్తాయి. ఈ రోజున పాలపిట్ట కనిపిస్తే శుభంగా భావిస్తారు. శమి వృక్షానికి పూజలు నిర్వహించి ఆ ఆకులతో శుభాకాంక్షలు చెప్పుకుంటారు. కొత్త పనులను, కార్యక్రమాలను కూడా ఈ రోజున ప్రారంభిస్తే విజయవంతమవుతాయని ప్రజలు నమ్ముతారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలాజీవేంకటే శ్వర స్వామి ఆలయంలో గురువారం నిర్వహించే విజయదశమి ఉత్సవాల కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హిందూ ఉత్సవ సమితి సభ్యులు తెలిపారు. రథోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ అర్చకుడు గంగు సత్యనా రాయణ తెలిపారు.


ఆసిఫాబాద్‌లో ముస్తాబైన వేదిక

పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను బుధవారం పలువురు అభినందించారు. హైదరాబాద్ నిజాం కళాశాల మైదానంలో గత నెల 26 నుంచి 29 వరకు జరిగిన 17వ హెచ్ఎఫ్ఐ మినీ బాలబాలికల హ్యాండ్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన క్రీడాకారులు బాలికల విభాగంలో గంగుబాయి, పార్వతి, వైష్ణవి, బాలుర విభాగంలో పార్థు రాష్ట్ర జట్టులో ఆడి బాలికలు బంగారు పతకం, బాలురు వెండిపతకం సాధించినట్లు హ్యాం డ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆసిఫాబాద్ జిల్లా అసోసియేషన్ ఇన్‌చార్జి అధ్యక్షుడు మల్లికార్జున్‌యాదవ్, డీవైఎస్‌వో రమదేవి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెంకటేష్, పీఈటీపీ కృష్ణమూర్తి, షేకు, కోచ్‌లు సాగర్, తిరుమల్, రవి, రాకేష్, సాయి, యాదగిరి అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు









డీఎస్‌సీడీవోగా సత్యజిత్ మండల్

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిగా సత్యజిత్ మండల్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో డీఎస్‌సీడీఓగా పని చేసిన సజీవన్ ఇటీవల పదవీ విరమణ పొందడంతో ఇన్‌చార్జి బాధ్యతలను సత్యజిత్ మండల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది సత్యజిత్ మండల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.


సత్యజిత్ మండల్

ఆలయంలో మహా చండీయాగం


చండీయాగం నిర్వహిస్తున్న అర్చకుడు దేవరవినోద్

రెబ్బెన, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామంలో వెలసిని శ్రీ కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి దేవస్థానంలో బుధవారం మహా చండీయాగం నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్క రించుకుని బుధవారం 11వ రోజు మహిషాసుర మర్థిని అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ అర్చకులు దేవర వినోద్ స్వామి, పూసాల మహేష్ శాస్త్రీ ఆధ్వర్యంలో మహా చండియాగం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసా దాలు అందించి అనంతరం ఆలయ అధ్యక్షుడు తిరుపతి గౌడ్, సుకన్య దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు.


నేడు మాంసం దుకాణాలు బంద్

సిర్పూర్(టి), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలో చికెన్, మటన్ షాపులు మూసి ఉంచాలని ప్రత్యేకాధికారి తెలిపారు. వ్యాపారులు సహకరించాలని కోరారు.















కుమరం భీం వర్ధంతికి హాజరు కావాలి

ముఖ్యమంత్రికి ఆహ్వానపత్రిక అందజేత




ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న భీం మనుమడు సోనేరావు, ఎమ్మెల్యే బొజ్జుపటేల్

కెరమెరి, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఈ నెల 7న నిర్వహించే కుమరం భీం వర్ధంతి కార్యక్రమానికి హాజరు కావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ భీం మనుమడు సోనేరావు, కమిటీ చైర్మన్ కుంరం లాల్‌షావ్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఐటీ డీఏ నూతన భవన నిర్మాణానికి నిధులు విడుదల చేసినందుకు ధన్యవా దాలు తెలిపారు. జోడేఘాట్ మీ టింగ్ స్థలంలో షెడ్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ మోతిరాం, ఏఎంసీ చైర్మన్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

వాంకిడి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని ఇందాని గ్రామానికి చెందిన కోట్రాంగి సోనాజీ (32) అనే వ్యక్తి మంగళవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కోట్రాంగి సోనాజీకు గత ఐదేళ్ల క్రితం కెరమెరి మండలం సాంగ్విగ్రామానికి చెందిన ఆశతో వివాహం జరిగింది. పనులు చేయకుండా మద్యం సేవించి తిరుగుతుండే వాడు. భర్త పని చేయకు పోవడంతో దీంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. వీరికి కూతురు. కుమారుడు ఉన్నారు. ఇంట్లో భార్య పిల్లలు లేకపోవడంతో మనస్తాపానికి గురై మద్యం మత్తులో మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై మహేందర్ తెలిపారు.

అభ్యర్థుల వేట



- నోటిఫికేషన్ విడుదలతో గ్రామాల్లో ఎన్నికల సందడి
- స్థానిక ఎన్నికల్లో పట్టు కోసం ప్రధాన పార్టీల దృష్టి
- మారిన రిజర్వేషన్లతో ఆశావహుల్లో నిరాశ

బెజ్జూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమరానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో గ్రామాల్లో ప్రధాన పార్టీలు అభ్యర్థుల వేట ప్రారంభ మయ్యాయి. రిజర్వేషన్ల ప్రకటన పూర్తికాగా, స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ కూడా విడుదల కావడంతో గ్రామాల్లో రాజకీయ వేడి అలుముకుంటోంది. కానీ రిజర్వేషన్ల ప్రకటనతో రాజకీయ కొత్త చిక్కులు మొదలయ్యాయి. ప్రధానంగా జిల్లా పరిషత్ చైర్మెన్ పదవిని బీసీ జనరల్‌కు కేటాయించడంతో ఆ వర్గంలో బలమైన నేత కోసం పార్టీలు అన్వేషిస్తున్నాయి. ఇక రిజర్వేషన్లు ప్రతికూలంగా ఉండటంతో మండలాల్లోనూ జడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు నేతలు కరువయ్యారు. జిల్లాలో మొత్తం 15 జడ్పీటీసీ ఉన్నాయి. జడ్పీ చైర్మెన్‌ను ఎన్నుకోవాలంటే కనీసం 8మంది జడ్పీ సభ్యుల మద్దతు అవసరం. ఈసారి ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయోననే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

నోటిఫికేషన్ జారీతో..

ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడంతో గ్రామాల్లో రాజకీయ వేడి అలుముకుంటోంది. ముఖ్యంగా రిజర్వేషన్లు కొంత మందికి అనుకూలంగా, మరి కొందరికి ప్రతికూలంగా రావడంతో ఆశావహుల్లో నిరాశే ఎదురైంది. మారిన రాజకీయ సమీకరణాల మూలంగా ఆయా మండలాల్లో అభ్యర్థుల వేట కోసం ప్రధాన పార్టీల నేతలు తల మునకలవుతున్నారు.

ఎప్పటి నుంచో ఎన్నికల బరిలో ఉందామనుకున్న కొందరి ఆశలకు గండి పడడంతో తప్పనిసరిగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండక తప్పడం లేదు. ముఖ్యంగా సిర్పూర్ నియోజక వర్గంలోని బెజ్జూరులో జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎస్టీ జనరల్‌కు కేటా యించగా, కౌటాలలో జడ్పీటీసీ, ఎంపీపీ పదవులు బీసీ జనరల్, సిర్పూర్ (టి)లో జడ్పీటీసీ ఎస్సీ జనరల్, ఎంపీపీ బీసీ జనరల్, కాగజ్‌నగర్‌లో జడ్పీటీసీ, ఎంపీపీ బీసీ మహిళకు, దహెగాంలో జడ్పీటీసీ ఎస్టీ మహిళ, ఎంపీపీకి ఎస్సీ జనరల్, పెంచికలపేటలో జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు ఎస్సీ మహిళ, చింతల మానేపల్లిలో జడ్పీటీసీ ఎస్టీ జనరల్, ఎంపీపీ బీసీ మహిళకు కేటాయించారు. దీంతో ఈ సారి అనుకున్న స్థానాల్లో రిజర్వేషన్లు అనుకూలించని కారణంగా కొందరికి నిరాశే మిగిలింది.

అయితే అన్నిచోట్ల దాదాపు కొత్త మొఖాలనే చూడాల్సి వస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సోదరులకు రిజర్వేషన్ అనుకూలించని కారణంగా ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాల్సిన పరిస్థితులే ఉన్నాయి. సిర్పూర్ నియోజకవర్గంలో ఒక్క స్థానం కూడా జనరల్‌కు కేటాయించని కారణంగా జనరల్ సామాజికవర్గానికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది.

పావులు కదుపుతున్న నేతలు..

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థుల కోసం ఇప్పటి నుంచే వేట ప్రారంభించారు. గ్రామాల్లో ఆర్థికంగా, రాజకీయంగా పలుకుబడి ఉన్న నేతల కోసం అన్వేషణ కొనసాగిస్తున్నారు. ప్రధాన పార్టీల నాయకులు గ్రామాల్లో పోటీ చేసేందుకు ఎవరూ సిద్ధంగా ఉన్నారనే విషయంపై స్థానిక నేతలతో చర్చలు జరుపుతున్నారు. తమకు అనుకూలంగా ఉండే వారిని బరిలో దించేందుకు పావులు కదుపుతున్నారు. అనుకున్న స్థానాల్లో రిజర్వేషన్లు అనేకూలించని కారణంగా తప్పనిసరి స్థితిలో ఇతరులకు అవకాశం ఇవ్వక తప్పడం లేదు. ఎప్పటినుంచో రాజకీయాల్లో తిరుతుగున్న నాయకుల ఆశలు గల్లంతు కావడంతో ఏంచేయాలో తోచడం లేదని అంటున్నారు. ఈ సారి మొత్తానికి రాజకీయాల్లో లేని వారికి అవకాశం దక్కే సూచనలు ఉన్నాయని చెబుతున్నారు. దీంతో ఎవ్వరికి అవకాశం దక్కునోనని ఆసక్తిగా చూస్తున్నారు.

14 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించాలి

సింగరేణి సీఎండీ బలరాం



మాట్లాడుతున్న బలరాం

మందమర్రిటౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ప్రతి రోజు 2.20 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి రవాణా లక్ష్యంగా పనిచేయాలని సింగరేణి సీఎండీ బలరాం తెలిపారు. బుధవారం కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం నుంచి ఆయన మాట్లాడారు. 14 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీనీ తొలగించేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. కంపెనీ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలన్నారు. అదనపు ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల ఈ సంవత్సరం మొదటి ఆరు నెలల్లో 91 శాతం ఉత్పత్తి లక్ష్యాలను, 93 శాతం రవాణా లక్ష్యాలను మాత్ర మే సాధించామన్నారు. మిగిలిన 6 నెలలు ఉత్పత్తి, అదనపు ఉత్పత్తిపై దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా కీలక ఖనిజాల అన్వేషణ రంగంలో కంపెనీ అడుగు పెట్టిందని, బొగ్గు బ్లాకులు, ఇతర ఖనిజాల కోసం ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందన్నారు. సింగరేణి బహుముఖ విస్తరణ పెరుగుతుండడంతో అధికారులు దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కంపెనీ మనుగడ కోసం ప్రతి ఉద్యోగి 8 గంటలు పనిచేయాలన్నారు. రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఉత్పత్తి, ఉత్పాదకత పెంచినప్పుడే సంస్థ మనుగడ ఉంటుంద న్నారు. డైరెక్టర్ పా గౌతమ్‌పొట్రు, డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, తిరుమల్‌రావు, ఈడీ కోల్ మూమెంట్ వెంకన్న, అధికారులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్యాలను సాధించాలి

ఏరియాను లాభాల దిశగా నడిపించాలి

మందమర్రి జీఎం రాధాకృష్ణ



మాట్లాడుతున్న జీఎం

మందమర్రిటౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను ముందే సాధించాలని, అదనపు ఉత్పత్తితోనే అభివృద్ధి ఉంటుందని మందమర్రి జీఎం రాధాకృష్ణ తెలిపారు. బుధవారం జీఎం మాట్లాడుతూ ఏరియాలో ఇటీవల కురిసిన వర్షాలతో ఉత్పత్తికి తీవ్ర అంతరాయం కలిగిం దని పేర్కొన్నారు. నష్టాన్ని పూడ్చేందుకు కార్మికులు, అధికారులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఆర్కే ఓసీపీ అనుమతులకు సంబంధించి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ప్రమాద రహిత ఉత్పత్తే ప్రధాన లక్ష్యమనే నినాదాన్ని విస్మరించవద్దన్నారు. అధికారులు, ఉద్యోగులు రక్షణ సూత్రాలు పాటించడం వల్ల ప్రమాదాలు జరగవని అన్నారు. లాభాల దిశగా నడిపించాలంటే సమయంతో సంబంధం లేకుండా విధులు నిర్వహించాలన్నారు. కేకే ఓసీపీకి సంబంధించి బొగ్గు రవాణా కోసం ఏర్పాటు చేస్తున్న రైల్వే సైడింగ్ పనులు కొనసాగుతున్నాయని, ఇది పూర్తయితే బొగ్గు రవాణా సులభతరం అవుతుందని తెలిపారు. నేరుగా ఓసీపీలో ఉత్పత్తి చేసిన బొగ్గు వ్యాగన్ల ద్వారా రవాణా చేయడం జరుగుతుందన్నారు. కార్మిక కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించి పలు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం కృషి చేస్తుందన్నారు. కార్మికులు గైర్హాజరు కావడం ద్వారా సంస్థపై ఉత్పత్తి ప్రభావం పడడంతో పాటు కార్మికుల కుటుంబాలకు ఆర్థిక నష్టం జరుగుతుందన్నారు. మెరుగైన పనితీరుతో కార్మికులు రూ. 3 లక్షలకు పైగా లాభాల వాటా పొందారని తెలిపారు.

గ్రూప్-1 కొలువు సాధించిన ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగం చేస్తే పట్టుదలతో గ్రూప్-1 కొలువు సధించిన ఉద్యోగులను బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.విజయభాస్కర్‌రెడ్డి బుధవారం గోలే టి జీఎం కార్యాలయం ఆవరణలో సన్మానించారు. జీఎం కార్యాలయంలో పర్సనల్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌లుగా పని చేస్తున్న బి.సుధీర్‌కుమార్, సాయివెంకట్‌రెడ్డి గ్రూప్-1లో మెరిట్ సాధించి ఎంపీడీవోలుగా ఎంపికయ్యారు. ఓ వైపు ఉద్యోగం చేస్తూ పట్టుదలతో చదివి గ్రూప్-1 సాధించిన వారిద్దరిని జీఎం శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తి, డీజీఎంలు ఉజ్వల్‌కుమార్ బెహెరా, శ్రీనివాసరావు, ఎస్ఈ జ్ఞానేశ్వర్, సీహెచ్‌పీ ఇన్‌చార్జి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపకందారుల అడ్డగింత



పట్టు పురుగుల పెంపకందారులను అడ్డుకుంటున్న అధికారులు

కోటపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కావర కొత్తపల్లి అటవీ ప్రాంతంలో బుధవారం పట్టు పురుగుల పెంపకందారులను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. అడవుల్లోకి రావద్దని పట్టుపురుగులను అటవీ ప్రాంతంలో పెంచవద్దని అటవీ సిబ్బంది ఆదివాసీలను అడ్డగించారు. దీంతో ఇటు ఆదివాసీలకు, అటు అటవీ శాఖ సిబ్బందికి వాగ్వాదం చోటు చేసుకుంది. తాము గత ఆరు దశాబ్దాలుగా మండలంలోని 750 కుటుంబాలు పట్టు పెరుగుల పెంపకంపైనే జీవిస్తున్నామని, ఇక్కడి పట్టు పరిశ్రమకు రాష్ట్రంలోనే గుర్తింపు ఉందని, ఇప్పుడు వద్దంటే తాము ఎలా బతికేదంటూ బాధితులు అటవీ సిబ్బందిని నిలదీశారు. దీంతో అటవీ సిబ్బంది నల్లమద్ది చెట్లపై పెరుగుతున్న పట్టు పురుగులను , వాటి గుడ్లను ధ్వంసం చేశారు. దీంతో తీవ్ర ఆందోళన నెలకొంది. అనంతరం బాధితులంతా చెన్నూరుకు చేరుకుని జెడ్పీ వైస్ చైర్మన్ మూ లరా జిరెడ్డి ఆధ్వర్యంలో అటవీ అభివృద్ధి శాఖ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఎంపీడీవో అందుబాటులో లేకపోవడంతో కార్యాల యం సిబ్బందికి వినతి పత్రం ఇచ్చారు.

ఆశావహులకు షాక్



ముగ్గురు పిల్లలుంటే అనర్హులే

వాంకిడి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ముగ్గురు లేదా అంత కంటే ఎక్కువ పిల్లలు ఉంటే వారు అనర్హులు. ఎంపీటీసీ, జడ్పీటీసీగా పోటీ చేసే వారిలో కొందరికి ముగ్గురు పిల్లలు ఉండడంతో వారందరు ఈ అంవంపై ఆరా తీస్తున్నారు. గతంలో ఈ చట్టానికి సవరణ చేస్తారని ప్రచారం జరిగిన నేపథ్యంలో ప్రస్తుతం ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఈ నిబంధనను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇటీవలే ఇందిరా పార్కు వద్ద ధర్నా కూడా చేశారు.

అయితే ఇప్పటి కే ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఇక నిబంధనను తొలగించడం కుదరదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న వారు పోటీ చేయడానికి అనర్హులే. జనాభా నియంత్రణ, ఒకరు లేదా ఇద్దరు పిల్లలు ఉన్న వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 1995లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ నిబంధనను తీసుకు వచ్చింది. నాటి నుంచి నేటి వరకు గ్రామీ ణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ నిబంధన కొనసాగుతోంది. పట్టణ స్థానిక సంస్థల్లో ఈ నిబంధనను బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తొలగించింది.

అయితే గ్రామీణ ప్రాంతంలో మాత్రం కొనసాగించారు. 1995 మే 31 కంటే ముందు ముగ్గురు పిల్లలు ఉంటే ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులు. కానీ 1995 జూన్ 1 నుంచి ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న వారు అనర్హులు. ఈ అంకాశానికి సంబంధించిన సవరణ చేయాలని అనుకున్నా చివరి నిమిషంలో ప్రతిపాదనను ప్రభుత్వం వెనక్కి తీసకుంది. అయితే ఏపీలో మాత్రం ఈ నిబంధనను సడలించి ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉన్న వాళ్లు కూడా అవకాశం కల్పించింది.

చట్టంలో మినహాయింపులు, షరతులు..

మొదటి కాన్పులో ఒకరు పుట్టి రెండో కాన్పులో ఇద్దరు పుడితే పోటీకి అర్హులే. ఒక వ్యక్తి మొదటి భార్యకు ఇద్దరు పిల్లలు ఉండి ఆమె చనిపోతే ఆయన రెండో పెళ్లి చేసుకున్నట్లయితే ఆమెకు మరొక సంతానం కలిగితే భర్త ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడు. కానీ ఆమెకు ఒకరే సంతానం కాబట్టి ఆమె పోటీ చేయడానికి అర్హురాలు. బతికి ఉన్న పిల్లలను మాత్ర మే లెక్కలోకి తీసుకుంటారు. ఉదాహరణకు ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తికి ముగ్గురు పిల్లలుండి అందులో ఒకరు చనిపోతే ఆ వ్యక్తి ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హుడే. మహిళకు ఇప్పటికే ఇద్దరు పిల్లలు ఉండి నామినేషన్ పరిశీలన నాటికి ఆమె గర్భవతి అయి ఉంటే ఆమె ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హురాలేనని పంచాయతీ శాఖ స్పష్టం చేస్తోంది.

నిబంధనలు ఇలా..

- ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీసం 21 ఏళ్ల వయస్సు ఉండాలి.
- ఎంపీటీసీగా పోటీ చేయడానికి ఆ మండలంలోని ఏ గ్రామంలోనైనా తప్పని సరిగా ఓటరు అయి ఉండాలి. జడ్పీటీసీగా పోటీ చేయడానికి పోటీ చేసే జిల్లాలో తప్పని సరిగా ఓటరై ఉండాల్సిందే.
- ఎంపీటీసీగా పోటీ చేసే అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి ఎంపీటీసీ స్థానం పరిధిలో ఒకరై ఉండాలి. జడ్పీటీసీని ప్రతిపాదించే వ్యక్తి పోటీ చేసే మండలానికి సంబంధించిన ఓటరై ఉండాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి, స్థానిక సంస్థల ఉద్యోగి అయి ఉన్నా ఎన్నికల్లో నామినేషన్ వేయవచ్చు. అయి తే నామినేషన్ పరిశీలన నాటిని ఆ ఉద్యోగానికి రాజీనామా ఆమోదించినట్లుగా ధ్రువపత్రాన్ని చూపించాల్సి ఉంటుంది.
- రేషన్ షాపు డీలర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయవచ్చు.
- అంగన్‌వాడీ వర్కర్ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హురాలు, 2007 ఉమ్మడి ఏపీ హైకోర్టు అనర్హులని తీర్పు ఇచ్చింది.
- సహకార సంఘాల ఆఫీసు బెరర్స్ స్థానిక ఎన్నికల్లో పోటీ చేయవచ్చు.
- ట్రస్ట్ బోర్డు, చారిటబుల్ సభ్యులు, చైర్మన్, మత సంస్థల్లో సభ్యులు పోటీ చేయడానికి అనర్హులు.
- ఆర్టీసీ, సింగరేణి ఉద్యోగులు ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. అయితే ఈ సంస్థల్లో పని చేసే మేనేజింగ్ ఏజెంట్, కంపెనీ కార్యదర్శులు మాత్రం పోటీ చేయడానికి అనర్హులు.
- ఒక వ్యక్తి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ వేయవచ్చు.
- నామినేషన్ వేసి వ్యక్తి తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవచ్చు. లేదా అతను నియమించుకున్న ఏజెంట్ లేదా ప్రతిపాదించిన వ్యక్తి కూడా విత్ డ్రా చేసుకోవచ్చు.
- బ్యాలెట్ పేపర్లో జాతీయ, ప్రాంతీయ పార్టీలు, ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన పార్టీలు, రిజిస్టర్డ్ సింబల్ రిజర్వు అయిన పార్టీలు, సింబల్ లేని రిజిస్టర్ పార్టీలు, చివరిగా ఇండిపెండెంట్లుగా ఉంటారు.
- ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తికి గ్రామంలో, పట్టణంలో రెండు చోట్ల ఓటు ఉన్నా పోటీ చేయవచ్చు. అయనను పోటీకి అనర్హుడిగా ప్రకటించడానికి ప్రస్తుతం పంచాయతీ రాజ్ చట్టంలో ఎలాంటి వెసులుబాటు లేదు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

సిర్పూర్(టి), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్ (టి) మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బీజేపీ మాజీ సర్పంచ్ గురుదాస్, ఒడ్డెటి నాని, కొండగుర్లె కొండయ్య మంగ ళవారం రాత్రి ఎమ్మెల్సీ దండెవిఠల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సంద ర్భంగా వారికి ఎమ్మెల్సీ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

తులసి వనమహోత్సవం

బెజ్జూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రంగనాయక ఆలయ ప్రాంగణంలో బుధవారం తులసి మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీ ల్దార్ రామ్మోహన్ ఆధ్వర్యంలో 108 తులసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆధ్యాత్మికతలో తులసి మొక్కకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మహేష్, శ్రీవర్ధన్, జగ్గాగౌడ్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సిబ్బంది

వయోజన విద్యకు ఉల్లాస్

- చదువు లేని మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాశాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో కార్యక్రమం



కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళల్లో అక్షర వెలుగులు నింపడంతో పాటు చదువు మధ్యలో ఆపేసిన వారికి విద్య అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపడుతున్నాయి. విద్యాశాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ సొసైటీ) పేరుతో స్వ యం సహాయక సంఘాల సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ప్రక్రియ ప్రారంభించారు. ఈ మేరకు జిల్లాలోని స్వశక్తి సంఘాల్లో చదువు రాని, మధ్యలో ఆపేసిన సభ్యులను గుర్తించి వివరాలు నమోదు చేశారు. వీరికి చదు వు నేర్పి ఆర్థిక, డిజిటల్, అక్షరాస్యత, వాణిజ్య నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కలిస్తారు.

96,580 మంది గుర్తింపు..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 96,580 మందిని గుర్తించారు. వీరిలో స్వయం సహాయక సంఘాల సభ్యులు అధికంగా ఉన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వీరిలో అక్షరాస్యత పెంపొందించడానికి నడుం బిగించారు. ఇందులో భాగంగా క్షేత్ర స్థాయిలో నిరక్షరాస్యులైన అతివలను గుర్తించారు. గ్రామాల్లో సర్వే నిర్వహించి జిల్లా వ్యాప్తంగా 96,580 మందిని గుర్తించి వీరిలో తొలివిడతలో 22500 మంది లక్ష్యంగా పని ప్రారంభించారు. వీరికి అక్షరాలు నేర్పడానికి 2250 మంది వాలంటీర్లను ఆయా సంఘాల్లో ఉన్న ఔత్సాహిక మహిళలను ఎంపిక చేస్తారు. జిల్లా వ్యాప్తంగా వాలంటీర్లను గుర్తించి 22,123 మందిని యాప్‌లో వివరాలు పొందు పరిచి, మండలాల వారీగా ఉపాధ్యాయులను, వీవోఏలకు శిక్షణ ఇస్తారు. చదువు చెప్పేందుకు అవసరమైన పుస్తకాలు ఆయా మండలాలకు చేరుకున్నాయి. గ్రామ స్థాయిలో వలంటీర్లకు శిక్షణనిచ్చి చుదువు నేర్చుకున్న తర్వాత ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి పదో తరగతి పూర్తి చేసేలా అవకాశం కల్పిస్తారు.

ఉల్లాస్ పథకంతో అక్షరాస్యత..

కటుకం మధూకర్, జిల్లా మోబిలైజేషన్ అధికారి

ఉల్లాస్ పథకంతో అక్షరాస్యత పెంపొందుతుంది. జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ, సెర్ప్ శాఖ సమన్వ యంతో నిరక్షరాస్యులను గుర్తించాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉల్లాస్ పథకం ద్వారా లక్ష్యం కంటే ఎక్కువ మందికి ఇప్పటికే గుర్తించాం. నిరక్షరాస్యులైన మహిళలు భవిష్యత్తులో చక్కని ఫలితాలు దీనితో సాధించగలుగుతారు. ఉల్లాస్ పథకంలో 912 మంది ఓపెన్ స్కూల్ విధానంలో చదువు మానేశారు.



మధ్యలో ఆపేసిన వారికి..

ఆర్థిక వెసులుబాటు, కుటుంబ పరిస్థితులతో మధ్యలో చదువు మానేసిన మహిళలపైనా దృష్టి సారించారు. తెలంగాణ సార్వత్రిక విద్యా పీఠ్ (టాస్) ద్వారా వీరికి అవసరమైన విద్య అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. వారిని ఓపెన్ స్కూల్‌లో చేర్పించి చదువుకునేలా ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో ఓపెన్ స్కూల్‌లో పదో తరగతిలోపు, ఇంటర్ వరకు చదువుకొని ఆపేసిన వారిని గుర్తించినట్లు జిల్లా అధికారి కటుకం మధూకర్ తెలిపారు. వీరికి పై చదువులు చదివేలా అవగాహణ కల్పిస్తారు. ఉన్నత విద్యతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ప్రోత్సహిస్తూ ఇప్పటి వరకు స్వయం సహాయ సంఘాల సమన్వయంతో పూర్తి స్థాయిలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసి వారి భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు.

నత్తనడకన రివైజ్డ్ పీపీవో ఆర్డర్ల పంపిణీ..



● ఆందోళన వ్యక్తం చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

శ్రీరాంపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రివైజ్డ్ పీపీవో(పెన్షన్ పేమెంట్ ఆర్డర్) పంపణీ నత్తనడకన సాగుతుండడంతో రివైజ్డ్ పెన్షన్లు అందుకునేందుకు ఎదురుచూస్తున్న సింగరేణి రిటైర్డ్ఉద్యోగుల జీవిత భాగస్వాములకు నిరాశ ఎదురవుతోంది. ఆర్డర్ల పంపిణీ నత్తనడకన సాగడంతో ఇబ్బందులకు గురవు తున్నారు. ఎంతో మంది కార్మికులు తమ కండలు కరిగించి సింగరేణి అభివృద్ధికి పాటుపడుతున్నారు. రిటైర్ అయిన తరువాత పింఛన్ స్వీకరిస్తున్నారు. ఒకవేళ వారు చనిపోతే వారి జీవిత భాగస్వాములకు 60శాతం పింఛన్ వస్తుంది. అయితే వీటిని పొందేందుకు బాధితులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

● ఆర్డర్ ఓకే... అమలే అయోమయం

ఈ తరుణంలో త్వరగా పెన్షన్ తీసుకునేందుకు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ అధికారులు 27జూలై 2023న ఉత్తర్వులు జారీచేశారు. దీని ప్రకారం త్వరగా రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ పొందేందుకు విశ్రాంత ఉద్యోగుల ఆధార్‌కార్డు, జీవితభాగస్వామి ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్(ఫార్మర్/సర్వైవర్ మోడ్ ఖాతా), పెన్షన్‌పేమెంట్ ఆర్డర్, జంటగా దిగిన భార్యాభర్తల ఫొటోలను తాము పనిచేసిన గని/ విభాగం సంక్షేమాధికారులకు అందించాలని సింగరేణి యాజమాన్యం ప్రకటించింది. దీంతో సుదూర ప్రాం తాల్లో ఉన్న విశ్రాంత ఉద్యోగులు దరఖాస్తులు సమర్పించారు. కానీ ఇంతవరకు ఆర్డర్లు అందలేదు. సింగరేణివ్యాప్తంగా 40,000 మంది విశ్రాంత ఉద్యోగు లకు రివైజ్డ్ పెన్షన్ ఆర్డర్లు పంపిణీ కాలేదు.

మాకు రాలేదంటే... మాకు రాలేదని...

ఇలా అందనివారు సీఎంపీఎఫ్ కార్యాలయంలో సంప్రదిస్తే తమకు డేటా రాలేదని, జీఎం కార్యాల యంలో కలిస్తే గనుల నుంచి మాకు రాలేదని, గని సంక్షేమాధికారులను అడిగితే మేము పంపామని ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తు న్నారు. అంతేకాకుండా ఇచ్చిన దరఖాస్తులను సైతం పోగొడుతున్నారని విశ్రాంత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణలు అనేకం ఉన్నాయి.

డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించాలి

ఈనాటి కాలంలో వెబ్‌సైట్ నుంచి ఆధార్, పాన్, లైఫ్ సర్టిఫికెట్, అనేక రకాల సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని వినియోగిస్తున్నాం. కానీ పెన్షన్ ఆర్డర్లు మాత్రం మ్యాన్‌వల్‌గా పొందాల్సి వస్తోంది. డౌన్‌లోడ్ సౌకర్యం కల్పించినట్లయితే అనేక రకాలుగా ఉపయోగకరంగా ఉంటుంది.

ఆర్డర్లు పొందితే....

ఒకవేళ పెన్షనర్ మరణిస్తే రివైజ్డ్ పెన్షన్ ఆర్డర్ ప్రకారం వారి జీవితభాగస్వామికి 60 శాతం పెన్షన్ అందే అవకాశం ఉంటుంది. దీనికి కేవలం 20 రోజుల సమయం సరిపోతుంది. సమీప ఎస్‌బీఐ బ్యాంకు వారిని సంప్రదించి పెన్షనర్ డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, పాస్‌పుస్తకం అందిస్తే చాలు. కానీ భర్తలు చనిపోయిన వారికి రివైజ్డ్ పెన్షన్ ఆర్డర్లు లేకపోవడంతో భార్యలకు పెన్షన్ రావడం లేదు. అధికారులు స్పందించి వెంటనే తమ దరఖాస్తులను సీఎంపీఎఫ్ కార్యాలయానికి పంపాలని కోరుతున్నారు.

దరఖాస్తు కనిపించడం లేదట..

- పి. సంపత్ కుమారచారి, రిటైర్డ్ క్లర్కు



శ్రీరాంపూర్ ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో క్లర్కుగా పనిచేసి రిటైర్ అయ్యాను. 2023 ఆగస్టులో రివైజ్డ్ పెన్షన్‌కోసం దరఖాస్తు చేసుకున్నా. జీఎం కార్యాలయంలో అడిగితే నాదరఖాస్తు పంపామన్నారు. సీఎంపీఎఫ్ ఆఫీసులో వాకబు చేస్తే నా దరఖాస్తు కనిపించడం లేదని చెప్పున్నారు.

దరఖాస్తు పోగొట్టారు..

- వి. లక్ష్మణాచారి, రిటైర్డ్ క్లర్కు



శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం 1ఏ గనిలో క్లర్కుగా చేసి రిటైర్ అయ్యాను. 2023 ఆగస్టులో రివైజ్డ్ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. ఆర్డర్ రావడం లేదని కార్యాలయంలో కలిస్తే దరఖాస్తు ఎక్కడో పోయిందన్నారు. మళ్లీ ఇవ్వాల్సి వచ్చింది.

రెండోసారి ఇచ్చాను

- గడ్డం వెంకటేశ్వర్లు, రిటైర్డ్ మైనింగ్ సర్దార్



భూపాలపల్లి ఏరియాలోని కేకే-5 గనిలో పనిచేసి రిటైర్ అయ్యాను. 2023 ఆగస్టులో రివైజ్డ్ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. ఎంతకూ రాకపోవడంతో ఈ నెల 17వ తేదీన కేకే-5 గని సంక్షేమాధికారి కార్యాలయానికి వెళ్లి కలిశాను. రెండేళ్ల క్రితం చేసుకున్న దర ఖాస్తు లభించడం లేదని, మళ్లీ దరఖాస్తు ఇవ్వాలని చెప్పారు. మళ్లీ ఇచ్చి వచ్చాను.

ఇబ్బందులకు గురవుతున్నారు

- అళవందార్ వేణుమాధవ్, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్



ఉప ప్రధాన కార్యదర్శి రివైజ్డ్ పెన్షన్ కోసం 2023లో ఆర్డర్స్ వచ్చాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొన్ని వేలమంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఇందులో 60 శాతానికి పైగా దరఖాస్తులు సీఎంపీఎఫ్ కార్యాలయానికి చేరడం లేదు. దీనివల్ల పెన్షనర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. సింగరేణి అధికారులకు ఇచ్చిన దరఖా స్తులను వెంటనే సీఎంపీఎఫ్ కార్యాలయా నికి పంపించాలి. అక్కడ పని పూర్తయితే పెన్షనర్లకు సులభంగా పెన్షన్ లభిస్తుంది.

యూరియా బస్తాల పంపిణీ



యూరియా బస్తాలను పంపిణీ చేస్తున్న అధికారులు

చెన్నూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆస్నాద గ్రామంలోని రైతు వేదికలో బుధవారం వివిధ గ్రామాలకు 532 యూరియా బస్తాలను కేటాయించగా అధికారులు పంపిణీ చేశారు. ఏవో యామిని ఆధ్వర్యంలో చెన్నూరు సీఐ దేవేందర్‌రావు దగ్గరుండి యూరియాను ఆయా గ్రామాలకు పంపిణీ చేయించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది లక్ష్మణ్‌రెడ్డి, శ్రీనివాస్, ఏఈవో సాగర్ పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం



జైపూర్ జాతీయరహదారిపై నిలిచిన వర్షం నీరు

జైపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. జైపూర్‌లోని జాతీయ రహదారిపై భారీగా వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్రఇబ్బందులు పడ్డారు. దాదాపు గంట సేపు కురిసిన వర్షానికి జాతీయ రహదారి పై ప్రయాణించే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

బీఎస్ఎన్ఎల్ రజతోత్సవాలు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్ రజతోత్సవ వేడుకలను బుధ వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్‌డీఈలు రవికుమార్, సురేందర్, చంద్రమౌళి, సదానందం, వెంకట్, క్రాంతి, జేటీవోలు రాజేశం, తిరుపతి, ప్రవీణ్, రాజేష్, మహేందర్ , సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాతలు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి బ్లడ్ బ్యాంకు సహకారంతో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్ మణికుమార్ ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల పట్టణంలోని హైవే కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 30 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. బీఎస్ఎన్ఎల్ 25 సంవత్సరాల వార్షికోత్సవం సందర్భంగా మంచిర్యాలలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో డి విజనల్ ఇంజనీర్ ప్రకాష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా 20 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జ్ మధు సూదన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ ప్రేమ్‌సాయి, సిబ్బంది మాదవి, ప్రణయ్, సురేష్, రజిత, సత్యవతి పాల్గొన్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

- నవంబరులో చీరల పంపిణీ
- డీసీసీ అధ్యక్షురాలు సురేఖ



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

మంచిర్యాల క్రైం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం చేపట్టే చీరల పంపిణీ కార్యక్రమాన్ని నవంబరు నెలలో చేపడతామని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అనారోగ్య కారణాల వల్ల చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరగలేదని, నవంబరు నెలలో రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మహిళలందరికి చీరల పంపిణీని చేపడతామని అన్నారు. ఓటు చోరీ కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల నియోజకవర్గంలో 1 లక్షా 50 వేల సంతకాల సేకరణ చేపడతామన్నారు. ఓటు చోరీతో బీజేపీ ప్రభుత్వం గద్దెనెక్కిందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిట్ల తిరుపతి, తాజా మాజీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



భీమారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

భీమారం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం భీమారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, రిజిస్టర్లు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యరంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం అన్ని ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించి మెరుగైన వైద్యసేవలు అందిస్తోందన్నారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతంర మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో మహా చండీయాగం





లక్షెట్టిపేట గోదావరి రోడ్డు హోమపూజలో పాల్గొన్నా ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కన్నెపల్లిలో మహా చండియజ్ఞం చేస్తున్న దీక్షపరులు, భక్తులు

లక్షెట్టిపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శరన్నవరాత్రోత్సవాల్లో బాగంగా నెలకొల్పిన శ్రీదుర్గామాతా మండపాల్లో బుధవారం మహాచండీయాగం నిర్వహించారు. స్థానిక ఇటిక్యాల శ్రీలక్ష్మినరసింహ ఆలయంలో ఆలయ అర్చకులు గొల్లపల్లి రామానందచారి ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించగా అమ్మవారు మహిశాసుర మర్ధినిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అదే విధంగా లక్షెట్టిపేట గోదావరిరోడ్డులోని శివ గణేష్ భక్త మండలి ఆధ్వర్యంలో వేద పండితులు ముద్ద ప్రణవ్ శర్మ, విశ్వాస్‌ల ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించగా కుమురంభీం ఆసీఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ హోమపూజలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొనగా మండప నిర్వహకులు కమిటి సభ్యులు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

దండేపల్లి: దేవి శవరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా దండేపల్లి మండలం కన్నెపల్లిలో బుధవారం మహిషాసుర మర్ధిని దేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా దుర్గాదేవి భవాని భక్తమండలి ఆధ్వర్యంలో దీక్షాపరులు, భక్తులు, కుటుంబసమేతంగా నిత్య పూజలు, మంత్రపుష్పం, మూల మంత్ర హవన హోయంతో పాటుమహా చండీ యజ్ఞంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మందమర్రిరూరల్: మండలంలో బుధవారం దుర్గామాతకు భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. మండపాల్లో దుర్గామాతను దర్శించుకుని పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. బ్రహ్మంగారి ఆలయంలో ఆలయ పూజారి కుషకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మది నిండుగా... పూల పండగ

దండేపల్లి ఆక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని మహిళలు, యువతులు ఆనందోత్సవంతో సద్దుల బతుకమ్మ సంబురాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వీధుల్లో బతుకమ్మలను పెట్టి గంటల పాటు ఆనందోత్సవంతో పాటలు పడుతూ సందడి చేశారు. రాత్రి సమయంలో గ్రామ సమీపంలో చెరువులు, వాగులో సతుపిండి వాయినాలు ఇచ్చిన అనంతరం మహిళలు బతుకమ్మలను నిమజ్జనం ఆనందోత్స వాల మధ్య చేశారు.





నెల్కివెంకటాపూర్‌లో సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు, మేదరిపేటలో బతుకమ్మతో మహిళ

గ్రూప్స్ విజేతలకు ఘన సన్మానం

దండేపల్లి ఆక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో చదివి గ్రూప్1, గ్రూప్ 2 ఉద్యోగాలు సాధించిన యువతి, యువకులు యువతలో స్ఫూర్తి నింపి, ప్రజలను చైతన్యవంతులు చేసేలా కృషిచేయాలని దండేపల్లి మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొండు జనార్దన్ సూచించారు. మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల దండేపల్లి మండలం నుంచి గ్రూప్ 1 ఉద్యోగు లుగా ఎంపికైన పాత విష్ణువర్ధన్, వనజ, గ్రూప్-2 ఉద్యోగులుగా ఎంపికైన అజ్మీరా గోపిచంద్‌నాయక్, బానోవత్ సంతోష్‌కుమార్, వారి తల్లిదండ్రులను మండలంలోని మేదరిపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పూలమాల శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఉన్నత ఉద్యోగులు సాధించడం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరా రు. అనంతరం ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన కొండు రామన్న, పోల్లంపల్లి రామరాజులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గడ్డం రాంచం దర్, కోశాధికారి కల్లెం రాజు, ఉపాధ్యక్షుడు బొలిశెట్టి రాజన్న, సభ్యులు మాదంశెట్టి మల్లికార్జున్, అన్నం సత్యనారాయణ, సభ్యులు సుగుణాకర్, కిషన్, నరేందర్, సత్తయ్య, లక్ష్మణ్, రాజిరెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, శ్రావణ్ పాల్గొన్నారు.



ఉద్యోగులు సాధించిన యువతి యువకులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



ఆకాశం ఎందుకో ఎర్రబడ్డది..

మండలంలో బుధవారం సూర్యుడు అస్తమిస్తున్న వేళ ఆకాశం ఎర్రబడి చూపరులను ఆకట్టుకుంది. మండలంలోని గుడిపేట శివారు మెడికల్ కాలేజీ ప్రాంతం జాతీయ రహదారిపై వెళ్లేవారు కాసేపు ఆగి తమ సెల్‌ఫోన్‌ల్లో ఈ దృశ్యాన్ని బంధించారు. - హాజీపూర్

'విజయదశమి అందరికీ విజయం చేకూర్చాలి'

మందమర్రిటౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ విజయదశమి అందరికి విజయాన్ని చేకూరించాలని, దుర్గామాత ఆశీస్సులు అందరిపై ఉండాలని మందమర్రి జీఎం రాధాకృష్ణ తెలిపారు. బుధవారం ఏరియా వర్క్‌షాపులో అయుధ పూజ కార్యక్రమానికి హాజరై డంపర్లు, డోజర్ తదితర వాహనాలకు పూజలు చేశారు. అధికారులు దూప్‌సింగ్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సుదర్శన్, ఇంజనీర్లు సదానందం,నరేష్, శ్రీనివాస్, సత్యనారాయణగౌడ్, పిట్‌కార్యదర్శి శర్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పైసల్లేవు.. పనుల్లేవు

- గుంతలమయమైన రోడ్లు - ఇబ్బంది పడుతున్న జనం



క్లబ్ రోడ్డులో తేలిన రాళ్లు

లక్షెట్టిపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు కాలనీల్లో గుం తలమయమైన రహదారులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిధులు లేక కనీస పనులు కూడా అధికారులు చేపించకపోవడంతో బురదమయంగా.. కంకర తేలిర రహదారులపైనే వెళ్లాల్సి వస్తోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా పండగల ముందు అధికారులు ఎక్కడ దెబ్బతిన్న రహదారులు ఉన్నా వెంటనే మరమ్మతులు చేపడుతుంటారు. కానీ ఈ సారి మాత్రం దసరా వచ్చినా అవే దెబ్బతిన్న రోడ్డు దర్శనం ఇస్తున్నాయి. పాలకవర్గం లేక పండగ పూట వాడలన్నీ వెలవెలబోతున్నాయి. మున్సిపాలిటీలో చిన్న వర్షానికే రహదారులు గుంతలుగా మారుతున్నాయి. రోడ్లకు ఇరువైపుల పిచ్చి మొక్కలు పెరగడంతో పాటు ఎటు చూసినా పిచ్చి కుక్కల బెడద తీవ్రంగా ఉంది.



వాటర్ ట్యాంక్ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, రోడ్డుపై నిలిచిన నీరు

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

● ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవు తుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. నార్నూర్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు చౌహన్ యశ్వంత్‌రావుతో పాటు కొంత మంది బుధవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవల చేయాలన్నా నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చెందాలన్నా బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమని చెప్పారు. అధికార పార్టీ నాయకులు కూడా బీఆర్‌ఎస్ పార్టీ వైపే మొగ్గు చూపుతున్నారన్నారు. చేరిన నాయకులందరికి పార్టీలో సరైన గౌరవం, గుర్తింపు ఉంటుందని చెప్పారు. ప్రజల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకురాలు సరస్వతి తదితరులు పాల్గొన్నారు..

ఇసుక అక్రమ రవాణా

● భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం

● పట్టించుకోని అధికారులు

ఆసిఫాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. నిబంధనలకు పాతరేసి అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఫలితంగా వాగులు, వంకలన్ని వట్టి పోయి భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. జిల్లాలో ఎలాంటి ఇసుక రీచ్‌లు లేక పోయినా ట్రాక్టర్ల యజమానులు నామ మాత్రంగా పర్మిట్‌లు తీసుకుంటూ ఒక్కో పర్మిట్‌పై పదేసి ట్రిప్పుల చొప్పున ఇసుకను తరలిస్తున్నారు. జిల్లా కేంద్రంతోసహా 15మండలాల్లోనూ ఇంచుమించు ఇదే తరహాలో మాఫియా దర్జాగా ఇసుక దోపిడికి పాల్పడుతోంది. నిర్మాణ రంగం ఊపందుకుంటున్న పరిస్థితుల్లో ఇసుకకు విపరీతమైన డిమాండ్ ఏర్పడడంతో వ్యవసాయ అవసరాల కోసం వినియోగించాల్సిన ట్రాక్టర్‌లు ఇసుక దందాలోనే తిరుగుతుండడం పరిస్థితి తీవ్రతకు దర్పణం పడుతోందని చెప్పవచ్చు. కాగా రెండు నియోజక వర్గాల పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయా పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధుల అండ దండలు ఈ అక్రమ వ్యాపారం వెనక పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ముఖ్యంగా ఆసిఫాబాద్ పట్టణ శివారులోని పెద్ద వాగు మొదలుకుని దహెగాం మండలంలోని ఎర్రవాగు వరకు నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్న ఇసుక చోరులు మాఫీయాను తలదన్నే రీతిలో ఏకంగా ఎక్స్‌కవేటర్లు, డోజర్లు వంటి యంత్ర సామాగ్రిని ఉపయోగించి మరీ ఇసుక వ్యాపారానికి తెర లేపడం అధికారుల పని తీరును ప్రశ్నార్థకంగా మార్చి వేసింది.



రెబ్బెన మండలంలో వాగులో ఎక్స్‌కవేటర్‌తో ఇసుక తోడుతున్న అక్రమార్కులు (ఫైల్)

జిల్లాలో ఇసుక రీచ్‌లు లేకున్నా..

వాస్తవానికి కుమరం భీం జిల్లాలో అధికారికంగా ఎలాంటి ఇసుక రీచ్‌లు గుర్తించలేదు. కానీ జిల్లాలో ఇబ్బడి ముబ్బడిగా ఉన్న వాగులు, వంకల ద్వారా ఉన్నా పోగయ్యే స్వల్ప పరిమాణం ఇసుక మేటలను కూడా వ్యాపారులు తరలిస్తున్నప్పటికీ రెవెన్యూ, భూగర్భ జల వనరుల శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. మార్కెట్‌లో ప్రస్తుతం టన్ను ఇసుకకు రూ.2000 నుంచి రూ.2500 వరకు ధర పలుకుతోంది. నిబంధనల ప్రకారం లారీలలో ఇసుక తరలించరాదన్న ఆదేశాల దృష్ట్యా అక్రమ ఇసుక తవ్వకం దారులు వ్యూహాత్మకంగా రూట్ మార్చి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రహస్య ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న డంప్‌లకు తరలించి అక్కడి నుంచి లారీల్లో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇలా జిల్లాలో రెబ్బెన మండలంలోని గంగాపూర్, పులికుంట, కొండపల్లి వాగులతో పాటు దహెగాం మండలంలోని కల్వాడ ఎర్రవాగు, పెద్దవాగు, కౌటాల మండలంలోని ముత్తంపేట, తాటిపల్లి వాగులు, చింతలమానెపల్లి మండలంలోని రుద్రాపూర్, చింతలమానెపల్లి, కాగజ్‌నగర్ మండలంలోని రాస్పెల్లి, పెద్దవాగు, కెరమెరి మండలంలోని సాంగ్వీ, కైరి వాగు, సిర్పూర్(టి) మండలంలోని పెద్దబండ వాగుల నుంచి ఇసుక మాఫీ పెద్ద ఎత్తున ఇసుకను వెలికి తీస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే ఈ వ్యవహారమంతా సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ ఇసుక సిండికేట్లు ముట్ట చెప్పే మామూళ్లకు ఆశ పడి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల పని తీరుపై ఆరోపణలు ఎక్కువ అయిన సమయాల్లో మాత్రం ఒకటి రెండు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నట్లు చెబుతున్నారు.



ఆసిఫాబాద్ పెద్దవాగులో ట్రాక్టర్లలో నింపుతున్న ఇసుక(ఫైల్)

వేసవిలో..

వర్షాకాలంలో పుష్కలంగా కనిపించే భూగర్భ జలాలు ఎండ కాలంలో పాతాళానికి చేరుతూ ఏటా మనుషులకే కాకుండా పశు పక్షాదులు, జంతువులకు తాగునీటి సమస్యలు ఉత్పన్నం కావడం ఇక్కడ సర్వ సాధారణం. సందేట్లో సడేమియాలా వాగులు వంకల్లో అడ్డగోలుగా సాగుతున్న ఇసుక తవ్వకాల మూలంగా ఉన్న కొద్ది పాటి భూగర్భ జలాల మట్టం కూడా దారుణంగా పడి పోతున్నట్లు భూగర్భ జల వనరుల శాఖ సేకరించిన సర్వేల్లో వెల్లడైంది. ముఖ్యంగా వాగులు, ఒర్రెలు ప్రవహిస్తున్న పరిసరాల్లో భూగర్భ జలాలపై ఇసుక తవ్వకాలు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. దాంతో ఆయా ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలు, గూడాల్లో తీవ్ర తాగునీటి సంక్షోభం తలెత్తుతున్నట్లు గుర్తించారు. నిబంధనల ప్రకారం నదు లు, ఉప నదుల్లోనే మీటర్ లోతుకు మించి ఇసుక తవ్వకాలు జరపడం నిషేధం. వాల్టా చట్టాన్ని అనుసరించి వాగులు, వంకల్లో అసలు ఇసుకె తీయరాదు. కానీ జిల్లాలో అడుగడుగున నిబంధనలు తుంగలో తొక్కుతూ అక్రమంగా ఇసుక దందా సాగుతుండడంతో భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల వల్ల నీటి వనరులన్ని కూడా అవిరై పోయి వన్యప్రాణులకు తాగునీటి లభించని పరిస్థితి ఉత్పన్నం కావడంతో నీటి కోసం అటవీ జం తువులు కాస్త గ్రామాలపై పడి రైతుల ఆస్తి, ప్రాణ నష్టాలకు హేతువుగా నిలుస్తున్నాయి.

యూరియా కోసం బారులు..



సిర్పూర్(టి)లో బారులు తీరిన రైతులు

సిర్పూర్(టి), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం వ్యవసాయాధికారులు యూరియా పంపిణీ చేయగా మండలంలోని పలు గ్రామాల నుంచి రైతులు ఉదయం 4గంటల నుంచే తరలి వచ్చి బారులు తీరారు. ఒక్కలారీ యూరియా 430బస్తాలు ఉండడంతో ఎకరానికి ఒక బస్తా చొప్పున పంపిణీ చేశారు. యూరియా దొరకని వారు, క్యూలైన్లలో నిలబడ్డ వారు ఆందోళనకు గురయ్యారు. తాము తెల్లవారు 4గంటలకే వచ్చినా యూరియా దొరక లేదని అసహనం వ్యక్తం చేశారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలి

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పార్టీ అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ సూచించారు. కలెక్టర్ చాంబర్‌లో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 16 జడ్పీటీసీ, 129 ఎంపీటీసీ స్థానాలకు రెండు విడతల్లో, 306 సర్పంచ్, 2,680 వార్డు సభ్యుల స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. నోడల్, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారుల ఆధ్వర్యంలో మండల స్థాయిలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి నామినేషన్ల స్వీకరణ, ఫిర్యాదులు, సందేహాల సంబంధిత అర్జీలను స్వీకరిస్తామని తెలిపారు.



నామినేషన్ల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందన్నారు. సభలు, సమావేశాల కోసం తహసీల్దార్ నుంచి అనుమతి పొందాలని సూచించారు. స్వతంత్ర అభ్యర్థులకు అందు బాటులో ఉన్న ఎన్నికల గుర్తులను అందించాలని అధికా రులను ఆదేశిం చారు. సమావేశాలు, రోడ్డు షోల్లో లౌడ్ స్పీకర్లను ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటలోపు మాత్ర మే వినియోగించాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే తగుచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జడ్పీ సీఈవో గణపతి, డీపీ వోవెంకటేశ్వర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ ఏర్పాటు

మంచిర్యాల కలెక్టరేట్: రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా నస్పూర్‌లోని కలెక్టరేట్ సముదాయంలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్లు, పరిశీలన, పోలింగ్, పోస్టల్ బ్యాలెట్, ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సమాచారం, దరఖాస్తుల కోసం హెల్ప్‌లైన్ నంబర్ 08736-250501 ఏర్పాటు చేశామని తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

హాజీపూర్: రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా, స్వేచ్ఛా యుత వాతావరణంలో జరిగేలా చూడాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, మండల ఎన్నికల ప్రవర్తన నియామవళి నోడల్ అధికారి, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం లీడర్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే మాట్లాడారు. జడ్పీటీసీ, ఎంపీ టీసీ ఎన్నికలు రెండు విడతల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహించడం జరుగుతుం దని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, పబ్లిక్ ప్లేస్‌లలో రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు ప్రచారానికి సంబంధించిన ఇతర అంశాలను తొలగించాలని పంచా యతీ కార్యదర్శులను ఆదేశించారు.

ఎన్నికలకు సంబంధించిన ప్రతీ అంశంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై దృష్టి సారించి ఎన్నికల ప్రవర్తన నియామవళి అమలు చేస్తామన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ అందరూ సమన్వ యంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఎస్‌ఐ స్వరూప్‌రాజ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రణాళికలు తయారు చేస్తున్నామని ఏదైన సమస్య వస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో సాధారణ పంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించుకుందామని దీని కోసం పోలీసుశాఖ 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీల్లో నగదు పట్టివేత

కాసిపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా తరలి స్తున్న రూ. 2.58 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు కాసిపేట ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన కోట దివాకర్, కోట శివాజీ మంచిర్యాల నుంచి వాహనంలో మహారాష్ట్రకు వెళ్తున్నారు. ఈక్రమంలో సోమగూడెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వారి వద్ద నుంచి రూ. 2.58 లక్షల రూపాయలు లభించాయన్నారు. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఎవరు కూడా రూ. 50 వేలకు మించి నగదును తీసుకువెళ్లవద్దని సూచించారు.









